కునుకు పట్టదాయే!

- వేధిస్తున్న నిద్రలేమి సమస్య
- స్థూలకాయం, బీపీ, షుగర్ వస్తాయంటున్న వైద్యులు
- యువత నుంచి వృద్ధుల వరకు బాధితులే
- జీవన శైలిలో మార్పు, మానసిక ఒత్తిడి, మొబైల్, టీవీలను అధికంగా చూడడమే కారణం
- జిల్లాలో 30 శాతానికిపైగా బాధితులు

కర్నూలు(హాస్పిటల్): కొందరు చల్లని గాలి తగిలితే కూర్చున్న చోటే నిద్రలోకి జారుకుంటారు. మరికొందరు అలా మంచంపై వాలగానే ఐదు నిమిషాల్లోనే గుర్రుపెట్టి నిద్రపోతుంటారు. మరికొందరు మంచంపై గంటల కొద్దీ పొర్లాడినా ఎంతకూ నిద్ర పట్టదు. దీంతో కొందరు రాత్రిళ్లు రోడ్లపై తిరుగుతుంటారు. ఇందుకు అనేక కారణాలున్నాయంటున్నారు వైద్యులు. పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, మానసిక ఒత్తిళ్లు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటివి నిద్రరాకపోవడానికి కారణంగా చెప్పవచ్చు. వయస్సును బట్టి నిర్ణీత సమయంలో గాఢంగా నిద్రపోతే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు. కోవిడ్–19 అనంతరం నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య మరింత పెరిగింది. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో చాలా మందిలో భయం, ఆందోళన ఎక్కువయ్యాయి. అప్పటి నుంచి అవి అలాగే కొనసాగుతూ నిద్రలేమి సమస్యగా రూపాంతరం చెందాయి. నిద్రలేమి సమస్యకు చికిత్స కోసం పలువురు కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరులోని జనరల్ ఫిజీషియన్లు, సైకియాట్రిస్ట్‌లను కలుస్తున్నారు. బాధితులకు వైద్యులు కౌన్సిలింగ్‌తో పాటు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

టీవీ, మొబైల్ ఫోన్లూ కారణం

నిద్రలేమికి ముఖ్య కారణం ఎక్కువసేపు టీవీ, మొబైల్ ఫోన్లు చూడటం, ల్యాప్‌టాప్‌లపై పనిచేయడమేనని వైద్యులు చెబుతున్నారు. ఆయా ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా వచ్చే బ్లూలైట్ కళ్ల మీద పడి నిద్ర సమయాన్ని దూరం చేస్తుందంటున్నారు. వీటిని చూస్తూ ఒకేచోట గంటలకొద్దీ కూర్చోవడం, అదే సమయంలో ఏదో ఒకటి తింటూ ఉండటం, శారీరక శ్రమ లేకపోవడం, ఫలితంగా ఊబకాయం రావడం వల్ల నిద్రలేమి సమస్య ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

నిద్రను దూరం చేసే మానసిక ఒత్తిడి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరిలో మానసిక ఒత్తిళ్లు తీవ్రమయ్యాయి. ఎదుటి వారితో పోటీ పడి అభివృద్ధి చెందాలని భావించడం, వారు పనిచేసే సంస్థలు విధించే లక్ష్యాలు, చదువు, ఉద్యోగం ఒత్తిళ్లు, వ్యాపారాలు జరగక కలిగే నష్టాల వల్ల తీవ్ర ఆందోళనలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల



మధ్య మనస్పర్థలు మానసిక ఒత్తిళ్లకు కారణం అవుతున్నాయి. నిద్రపోవడానికి సిద్ధమైనా అవే ఆలోచనలు గంటల కొద్దీ వేధిస్తున్నాయి. ఫలితంగా చాలా మంది రాత్రి రెండు, మూడు గంటల వరకు నిద్రరాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వయస్సును బట్టి 6 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఔషధాలపై ఆధారపడాల్సిన పరిస్థితి

వివిధ కారణాల వల్ల నిద్రలేమితో బాధపడే వ్యక్తులు ఇటీవల ఔషధాలను వాడుతూ నిద్రకు ఉపక్రమించే పరిస్థితి ఏర్పడింది. నిద్రమాత్రల నుంచి మానసిక ఒత్తిడి, టెన్షన్, ఆందోళన, భయం, డిమెన్షియా, స్కిజోఫ్రీనియా వంటి మానసిక ఒత్తిళ్లకు వాడే మందులు కూడా ఉంటున్నాయి. వీటిని వాడే వారు వైద్యుల సూచన మేరకు మాత్రమే వాడాల్సి ఉంటుంది.

రాత్రంతా రోడ్లపై తిరగడమే!

నిద్రలేమితో బాధపడే వారిలో ఇటీవల కాలంలో యువత అధిక సంఖ్యలో ఉంటున్నారు. వారు ఇంట్లో ఉండలేక రాత్రిళ్లు రోడ్లపై స్నేహితులతో కలిసి తిరుగుతూ గడుపుతున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి పట్టణాల్లో రాత్రి వేళల్లో రోడ్లపై ఏర్పాట్లు చేసిన తోపుడు బండ్లు, టీ స్టాళ్ల వద్ద ఇలాంటి వారి రద్దీ అధికంగా ఉంటోంది. రాత్రంతా ఇలా తిరుగుతూ గడిపాక ఎప్పుడో తెల్లవారుజామున మూడు గంటల తర్వాత ఇళ్లకు చేరుకుని నిద్రకు జారుకుంటున్నారు.

హార్మోన్ల అసమతుల్యత వల్లే..



మనిషిలో తీవ్ర ఒత్తిడి, ఆందోళనల కారణంగా హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఫలితంగా నిద్రలేమి వస్తుంది. నిద్రలేమి వల్ల బీపీ, షుగర్‌లు వస్తాయి. ఎక్కువ రోజులు నిద్రలేమి ఉంటే గుండెజబ్బులు రావడానికి అవకాశం ఉంటుంది. పని ఒత్తిడిని టెన్షన్‌ను పక్కన పెట్టి రాత్రి 10 గంటలకంతా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి.

– డాక్టర్ ఎస్. చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

నిద్రలేమితో మతిమరుపు సమస్యలు



నిద్రలేమి సమస్యతో మతిమరుపు, ఆందోళన వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇప్పటికే మూర్ఛ వ్యాధితో బాధపడే వారిలో నిద్రలేమి సమస్య ఉంటే మరింత పెరిగే అవకాశం ఉంది. కొంత మందిలో నరాల నొప్పులు ఉన్నా నిద్రలేమి ఉంటుంది. దానికి చికిత్స తీసుకుంటే నిద్ర బాగా పట్టి ఇతర సమస్యలు రాకుండా చేసుకోవచ్చు.

– డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

క్లుప్తంగా

వార్షికోత్సవ సందడి



నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు సిటీ: స్థానిక వెంకటరమణ కాలనీలోని శ్రీలక్ష్మీ హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాల విద్య కీలకమైందని, ఈ దశలో నేర్చుకునే నైపుణ్యాలు గొప్ప భవిష్యత్తును ఇస్తాయన్నారు. అనంతరం 2023–24 టెన్త్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి సన్మానించి, మొమెంటోలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరెస్పాండెంట్ వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ హరిణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోమలను నివారించాలి



నీటి నిల్వలను పరిశీలిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసి దోమలు పెరుగుదలను అరికట్టాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. శుక్రవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని చాణిక్యపురి కాలనీలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపును అరికట్టవచ్చన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల్లోపే ప్రజలు తమ పనులు ముగించుకోవాలన్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలని, నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లి గంట గంటకు తాగాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

కొండను కొల్లగొట్టేస్తున్నారు!



ఇటాచితో మట్టిని తవ్వుతున్న దృశ్యం

కల్లూరు: పట్టా భూమి, డి.పట్టా (అసైన్డ్ భూములు), ప్రభుత్వ భూముల్లో ఖనిజాలు, గ్రావెల్ తీసుకోవాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. భూముల్లోని ఖనిజాలు, ఇతర గ్రావెల్, కంకర వంటివి ప్రభుత్వ అవసరాల నిమిత్తం వాడుకోవాలనుకున్నా అనుమతి తీసుకుని రాయల్టీ చెల్లించాలి. అయితే కొందరు అక్రమార్కులు కల్లూరు మండలం తడకనపల్లె గ్రామం హంద్రీనీవా కాలువకు ఎదురుగా ఉన్న కొండను ఇటాచీలతో తవ్వుతూ మట్టిని ట్రక్కుల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కూటమి నాయకుల అండదండలతో మట్టిని తవ్వుతున్నారని గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. తవ్విన గ్రావెల్ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని కర్నూలు నగరంలోని వెంచర్లకు తరలిస్తున్నారని సమాచారం.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



మాట్లాడుతున్న చిన్నావుల వేంకట రాజారెడ్డి

కర్నూలు కల్చరల్: తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. తెలుగు కళ్లం సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరేపల్లి వరలక్ష్మమ్మ, డాక్టర్ కర్నాటి చంద్రమౌళి, ఎలమర్తి రమణయ్య, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా తదితర 25 మంది కవులు పాల్గొని కవితలు వినిపించి అలరించారు. డాక్టర్ హరికిషన్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

నేడు వినాయక్ ఘాట్‌లో..

కర్నూలు కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు వినాయక్ ఘాట్‌లోని వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో ఉగాది కవితా సమ్మేళనం నిర్వహించనున్నట్లు జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ఎండీవీఎస్ రామశర్మ తెలిపారు. 22 మంది కవులు కవి సమ్మేళనంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు ఉగాది వేడుకలు

కర్నూలు కల్చరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 30న ఉదయం 11 గంటల నుంచి ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిర్డీ సాయిబాబా దేవాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయి సత్సంగం, సంధ్యా హారతి, చిన్నారుల నృత్య ప్రదర్శన, రాత్రి 8 గంటలకు పల్లకీ సేవ రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

కుట్రలను ఛేదించి వైఎస్సార్‌సీపీ విజయం



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిర్వహించిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అద్భుత విజయం సాధించిందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన శుక్రవారం సి.క్యాంపులోని కార్యాలయంలో మాట్లాడుతూ.. అధికార బలంతో దౌర్జన్యంగా అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రయత్నించినా కూటమి ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 51 స్థానాల్లో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు జరగ్గా అందులో 30 స్థానాల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించిందన్నారు. కేవలం 12 స్థానాల్లో మాత్రమే కూటమి ప్రలోభాలు, బెదిరింపులు పనిచేశాయని ఆరోపించారు. మరో పది స్థానాల్లో ఓటమి భయంతో ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేయించిందన్నారు. ఈ ఫలితాలను బట్టి వైఎస్సార్‌సీపీపై ప్రజల్లో ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని స్పష్టమైందన్నారు. 10 నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం మానుకుని వెంటనే సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు అండగా నిలవడమే పీ–4 లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పేదలకు అండగా నిలవాలన్న లక్ష్యంతోనే పీ–4 కార్యక్రమాన్ని ఉగాది నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పేదరిక నిర్మూలనకు పీ–4 (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్స్–పార్ట్‌నర్‌షిప్) విధానంపై స్టేక్ హోల్డర్లు, ఇండస్ట్రియల్ అసోసియేషన్‌లు, చాంబర్ ఆఫ్ కామర్స్, పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర–2047లో భాగంగా ప్రభుత్వం పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దేందుకు పీ–4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది.. అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందికి చేయూత ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వీరిని గుర్తించేందుకు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఈ సర్వేలో గ్రామసభలు నిర్వహించి అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందిని గుర్తించారని వివరించారు. పేదలకు అండగా నిలవాలనుకునే దాతలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యామ్‌కుమార్, సీపీఓ ప్రభాకరరాజు పాల్గొన్నారు.

ప్రవక్త సందేశం సమాజానికి స్ఫూర్తిదాయకం



ప్రార్థన చేస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా తదితరులు

కర్నూలు (టౌన్): మహమ్మద్ ప్రవక్త ఇచ్చిన సందేశం సమాజానికి స్ఫూర్తి దాయకమని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. శాంతి, సౌభ్రాతృత్వం గురించి మహమ్మద్ ప్రవక్త చెప్పిన సందేశాన్ని గుర్తు చేసుకుంటూ వారి స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణానికి పాటుపడదామన్నారు. ప్రార్థనలు ముగిసిన తరువాత జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కర్నూలు (టౌన్): మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. స్థానిక స్వామిరెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న వంకాయల కోటమ్మను రెండు నెలల క్రితం షాహినా అనే మహిళ కలిసింది. కొద్ది రోజులు ఇల్లు బాడుగకు ఇస్తే ఏదైనా పని చూసుకొని వెళ్లిపోతానని చెప్పింది. జాలిపడిన కోటమ్మ ఆ మహిళ వివరాలు తెలుసుకోకుండానే ఇంటిని బాడుగకు ఇచ్చింది. కోటమ్మ భర్త అనారోగ్యంతో నెల్లూరులో ఉండటంతో తరచూ అక్కడికి వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని పొరుగువారు కోటమ్మకు చెప్పారు. ఆమె ఇంటికి వచ్చి ఎంతగా పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూశారు. లోపల సీలింగ్ ఫ్యాన్ పైపుకు మహిళ చీరతో ఉరి వేసుకుని కనిపించింది. శవం కుళ్లిపోయి ఉండటంతో వెంటనే మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలి 5 అడుగుల ఎత్తు ఉండి తెలుపు వర్ణంతో ఉందని తెలిపారు. కుడి చేతిపై ఎం.లాజర్ అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు సీఐ 91211 01061 సెల్ నంబర్‌కు సమాచారం తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సావిత్రిబాయి, ఐజయ్య తదితరులు

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ, మదర్ థెరిస్సా స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం ల్యాంప్ లైటింగ్, ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ వై.చంద్రమౌళి మాట్లాడుతూ.. నర్సింగ్ విద్యార్థినులు సేవా దృక్పథంతో మెలుగుతూ ఉన్నత శిఖరాలకు చేరుకుని, కళాశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలన్నారు. ప్రిన్సిపాల్ జి.సలోమి విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే వై.ఐజయ్య, రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిపోర్టర్ గంగన్నపై కేసు ఎత్తివేయాలి

కర్నూలు(సెంట్రల్): తెలంగాణ మన తెలుగు దినపత్రిక ప్రతినిధి గంగన్నపై పెట్టిన కేసును ఎత్తివేయాలని యునైటెడ్ జర్నలిస్టు ఫోరం జిల్లా కార్యదర్శి సి.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఏఓ విజయశ్రీకు యూజేఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణలో 10వ తరగతి గణితం ప్రశ్నపత్రం లీక్ కావడంతో సంబంధిత వార్తను మన తెలుగు దినపత్రిక యాప్‌లో ప్రచురించారన్నారు. దీనిపై కుట్రపూరితంగా జూకల్ పోలీసులు గంగన్నను అక్రమ అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. వెంటనే అతనిపై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాల నాయకులు విద్యాసాగర్, చిన్న రామాంజనేయులు, నీలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

పండుగ రోజుల్లోనూ పన్ను చెల్లింపు

కర్నూలు (టౌన్): ఈనెల 30, 31న పండుగ రోజుల్లోనూ మున్సిపల్ ఆస్తి పన్ను, నీటి పన్నులను చెల్లించవచ్చని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆది, సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయాల్లో పన్ను వసూళ్ల కేంద్రాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చని వెల్లడించారు. అలాగే ప్రజలు ఇంటి వద్ద నుంచే పన్నులను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా చెల్లించవచ్చని, వాట్సప్ నంబర్ 95523 00009, అలాగే పురసేవ యాప్, వెబ్‌సైట్ https://cdma.ap.gov.in/en/ptpaymentsలో చెల్లించవచ్చన్నారు. అలాగే కల్లూరు వార్డు కార్యాలయం (85వ సచివాలయం), జీఎస్ఆర్ నగర్ (సి.క్యాంపు రైతుబజార్ సమీపంలో 62వ సచివాలయం), బాలాజీనగర్ 104వ సచివాలయంలలో పన్నులు చెల్లించవచ్చని వెల్లడించారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: దాతృత్వానికి ప్రతీక రంజాన్ అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ శేషాద్రి నగర్‌లో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మైనారిటీ అధ్యక్షుడు యూనుస్ బాషా స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో రోజంతా ఉపవాసం ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ నాగ లక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న రన్ ఫర్ జీసస్

కర్నూలు (టౌన్): వచ్చే నెల 19న కర్నూలు పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోల్స్ సంఘం అధ్యక్షుడు ఎ.డి.ఏ.లింకన్ వెల్లడించారు. కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్, అన్ని సంఘాల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కన్వీనర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ.. కోల్స్ చర్చి నుంచి రన్ ప్రారంభమై స్టేట్ బ్యాంకు, మౌర్య ఇన్, రాజ్‌విహార్, కలెక్టరేట్ మీదుగా సి.క్యాంపు ప్రార్థన మందిరం వరకు సాగుతుందన్నారు. కోల్స్ చర్చి సంఘం కాపరులు అనిల్ కుమార్‌సామేల్, సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శాలెం, కార్యదర్శి దాసు బాబు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, పాస్టర్లు

నియోజకవర్గాల పునర్విభజన వాయిదా వేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

కర్నూలు కల్చరల్: నియోజకవర్గాల పునర్విభజనను మరో 25 సంవత్సరాలు వాయిదా వేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ×భారత రాజ్యాంగం× పుస్తకావిష్కరణ, ×డీలిమిటేషన్× వరమా.. శాపమా? అనే అంశంపై సెమినార్ జరిగింది. జేవీవీ వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, విశ్రాంత ఉపన్యాసకులు రమేష్ మాట్లాడుతూ.. నియోజక వర్గాల పునర్విభజన జరిగితే ప్రస్తుత దేశ జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలు ఏపీలో 25 నుంచి 20కి, తెలంగాణలో 17 నుంచి 15కు, తమిళనాడులో 39 నుంచి 32కు, కేరళలో 20 నుంచి 14కు తగ్గే అవకాశం ఉందన్నారు. యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. యూఎన్‌ఓ రిపోర్టు ప్రకారం దేశ జనాభా 2060 నాటికి స్థిరపడుతుందన్నారు. డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండానే రాజ్యాంగంలోని ముఖ్యమైన అధికరణలను సవరించుకోవచ్చన్నారు. ఇలాంటి తరుణంలో డీలిమిటేషన్ ప్రక్రియను మరో 25 సంవత్సరాల పాటు వాయిదా వేయాల్సిన అవసరం ఉందన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు మన్సూర్ బాషా, జిల్లా కార్యదర్శి ప్రతాపరెడ్డి, ఇమాన్యుయేల్, గజల్ గాయకులు మహమ్మద్ మియ్యా, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ



ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ శుక్రవారం సాయంత్రం నగరంలోని మెడికవర్, శివానీ హాస్పిటల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రంలోని రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని హాస్పిటల్స్, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు రికార్డులు, రిపోర్టులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, వైద్యుల అర్హత సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ప్రదర్శించాలని సూచించారు. గర్భస్థ పిండం లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, అలా చేస్తే పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 29న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. సెంట్రల్ సెక్షన్ పరిధిలోని వడ్డెగేరి, కాంగ్రెస్ ఆఫీసు ఏరియా, హెడ్ పోస్టాఫీసు, ఎగ్జిబిషన్ గ్రౌండ్, దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్, వెంకటేష్ సినీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.